

# బురుజువీధి కథలు

– కె.వి.రమణరావు



(వినగలిగితే భూగోళమ్మీద ప్రతి పదార్థమూ, ప్రతి ప్రదేశమూ కథలు చెబుతాయి. మరి, మా బురుజువీధీ అందుకు మినహాయింపు కాదు. మా బురుజువీధి చెప్పిన, చెబుతున్న కథలు నెలకొకటిగా మీ కోసం...)



# బయటి మనిషి

**“నడివయసులో తొలిప్రేమ సాధ్యమా?”** అనడిగాను మా ఎదురింటి చలపతిని. ఇద్దరం ఆసాయంకాలం ఆఫీసులనుంచి వస్తూ మా బురుజువీధి మొదట్లో కలిసి మా ఇళ్లవైపు నడుస్తూ అప్పుడే ధనుంజయ ఇల్లు దాటుతున్నాము. ఎప్పటిలాగే మా వీధిలో అంతగా జనం లేరు.

“ధనుంజయ, రత్నమ్మల గురించేనా నువ్వడుగుతున్నది?” అని నవ్వి “ప్రేమ యేవయసులోనైనా కొత్తగా పుట్టొచ్చు. కానీ యవ్వనంలో పుట్టి, పెళ్లితో అంతమయ్యేవాటిని మాత్రమే సంఘం ఆమోదిస్తుంది. అదీ సంఘనియమాలకు లోబడివుంటేనే" ఆన్నాడు చలపతి.

“మరి భగ్న ప్రేమికులను సంఘం కీర్తిస్తుందిగా” అన్నాను.

“పాటించడం, మెచ్చుకోవడం ఒకటికాదు. కీర్తించడంలో సంఘానికి బాధ్యతేమీ ఉండదు. అదొక స్పందన. గాంధీగారిని కీర్తించినట్టే" జవాబిచ్చాడు చలపతి.

"ధనుంజయ చనిపోయి అప్పుడే యిరవై రోజులౌతోంది. యేడుగంటలకి వాళ్లింట్లో మన వీధి సంక్షేమ సంఘం సమావేశముంది. నువ్వూ వస్తున్నావుగా అక్కడ కలుద్దాం" అని మాయింటివైపు తిరిగాను.

ఏడుగంటలకంతా బట్టలు మార్చుకుని సమావేశానికి తయారయ్యాను. మా ఆవిడ కామేశ్వరి పెరటి వాకిలి దగ్గర ఆరిన బట్టలు మడత పెడ్తోంది.

"మీ సంక్షేమ సంఘ సమావేశం రత్నమ్మ గురించేనా. ఐనా ధనుంజయ కూతురు కమల నిన్ననే వెళ్లిపోయిందిగా" అంది కళ్లెత్తి చూసి.

"ఆమె అన్నలిద్దరూ యింకా వున్నారుగా. యీ వ్యవహారం సెటిల్ చేసుకుని రాత్రికి వెళ్లిపోతారుట" అన్నాను.

"మీ సంఘం పెద్దలు సవ్యంగా సెటిల్ చేస్తారనే? అదీ రత్నమ్మ లాంటి యెవరూ లేని ఆడమనిషి విషయంలో" అంది నిరసనగా.

"వాళ్లు అన్నికోణాల్లో అలోచించే యేదైనా చేస్తారు. మీ అనధికారిక మహిళా సంఘానికి వాళ్లంటే పడదు కాబట్టి అన్నీ నెగెటివ్ గా చూస్తారు" అన్నాను.

కామేశ్వరి పెదవి విరిచి మౌనంగా పెరట్లోకెళ్లింది. నేను ధనుంజయ గురించిన అలోచనల్లో పడిపోయాను.

ధనుంజయ ఇల్లు మా బురుజువీధిలో కచేరిసత్రానికి గుడికి మధ్యన, సత్రం వైపు ఉంటుంది. అది మూడు పడగ్గదుల పెంకుటిల్లు. ఇంటిముందు అరుగులు, పెరట్లో కొబ్బరి, వేప చెట్లుంటాయి. ఉగాదిరోజు మావీధిలో సగం ఇళ్లకు

వేప్పూత అక్కడినుంచే సరఫరా ఔతుంది. ఫార్మసి చదివిన ధనుంజయకు పెద్దబజార్లో స్వంత మందుల షాపుండేది. అతనికి ఇద్దరు కొడుకులు శేషు, మణ్యం. తరువాత కమల. ముగ్గరికీ పెళ్ళిళ్లైపోయి ఉద్యోగాల్లో దూరంగా ఉంటున్నారు.

ధనుంజయ భార్య ఆరేళ్లకింద జబ్బుచేసి మూణ్ణెల్లపాటు అవస్తపడి చనిపోయింది. తాయారమ్మ తనకు జబ్బు చేసినప్పుడు ఇంట్లో చేసేవారు లేక సాయంకోసం తన దూరపు చుట్టమైన రత్నమ్మను తెచ్చి ఇంట్లో పెట్టుకుంది. రత్నమ్మకు ఎవరూలేక టౌన్లో అక్కడా ఇక్కడా వంటలు చేస్తూ కాలం గడిపేది.

తల్లిపోయాక వ్యాపారాన్ని మానేసి తమదగ్గరకు రమ్మని తండ్రిని కొడుకులు పిలిచారు. ధనుంజయ వెళ్లలేదు. తనకు సహాయంగా రత్నమ్మను యింట్లోనే ఉంచేసుకున్నాడు. కొడుకులకు ఇష్టం లేకపోయినా చేసేదేమీ లేక ఊరుకుండిపోయారు. కమలకు పురుళ్లుకూడా ఆమే పోసింది.

మొదట్లో రత్నమ్మ సన్నగా, ఎండిపోయినట్టుగా ఉండేది. కట్టుకోవడానికి సరైన చీరలుకూడా లేక బయటికి ఎక్కువ వచ్చేదికాదు. తాయారమ్మ పోయిన ఏడాది తర్వాత ఆమెలో క్రమంగా మార్పు వచ్చింది.

వయసు పదేళ్లు తగ్గినట్టుగా మనిషి ఆరోగ్యంగా తయారైంది. మొహంలో కళ వచ్చింది. వీధిలో ఎవరింట్లో ఫంక్షనుకు పిలిచినా మంచి చీరకట్టుకుని, పెద్ద బొట్టుతో, తలనిండా పూలతో వచ్చేది. అందర్తో మంచిగా, సాయంగా ఉండేది.

ధనుంజయలో కూడా మార్పొచ్చిందని, మంచి బట్టలు వేసుకుంటున్నాడని, పెడసరంగా ఉండిన అతను ఉత్సాహంగా నవ్వుతూ మాట్లాడుతున్నాడని, ఇదివరకట్లా కాక ఇంట్లో ఎక్కువ సమయం గడుపుతున్నాడని చెప్పుకోవడం మొదలైంది.

వీధిలో ఈ మార్పులను కొందరు ఆహ్వానిస్తే మరికొందరు వ్యతిరేకించారు. ధనుంజయతో ఆమెను టౌన్లో సినిమాహాల్లో, ఎగ్జిబిషన్లో చూసామని గుసగుసలు బయలుదేరాయి. వాళ్లు తిరుపతిలో పెళ్లి చేసుకున్నారని పుకార్లుకూడా వచ్చాయి.

తాయారమ్మతో ధనుంజయకి చిన్నవయసులోనే పెళ్లవడం, వెంటనే పిల్లలు పుట్టడం, వ్యాపార ఒత్తిడితో ఉండడం వల్ల ఇన్నేళ్లూ అతను యాంత్రికంగా గడిపాడని ఇప్పుడే అతనికి ప్రేమ, అనురక్తి తెలుస్తున్నాయని మావీధిలోని విజ్ఞులు విశ్లేషణ చేసారు.

ఐతే ఇదంతా మా సంక్షేమ సంఘం పెద్దలకి నచ్చలేదు. సంప్రదాయం మంటగలసిపోతోందని ధనుంజయను హెచ్చరించారు. కొడుకులతో చెప్పించారు. రత్నమ్మను పరోక్షంగా వెలివేసారు. చివరికి రత్నమ్మను పెళ్లిచేసుకుంటే తమకేమీ అభ్యంతరం ఉండదని చెప్పారు.

ధనుంజయ మా సంఘ పెద్దల్ని లెక్కచెయ్యలేదు, ఆమెను పెళ్లీ చేసుకోలేదు. అందరికీ అదొక పజిల్ గా అనిపించింది. అతను పెళ్లి చేసుకుని ప్రేమలోని ఆనందాన్ని పోగొట్టుకోలేకే అలా ఉండిపోయాడని మా విజ్ఞులు మళ్లీ తీర్మానించారు.

దాదాపు నాలుగేళ్లు అలాగే గడచిపోయాయి. ధనుంజయకు మంచికాలం ముగిసినట్టైంది. ఆర్నెల్లకిందట ధనుంజయక్కూడా పెద్ద జబ్బు చేసి మంచం పట్టాడు.

ఇరవైరోజుల కిందట చనిపోయేవరకూ అతను దాదాపుగా మంచంమీదేవున్నాడు. ఆ జబ్బు ప్రమాదకరమని, రత్నమ్మ డబ్బు, బంగారం చేజిక్కించుకుని అతన్ని వదిలేసి వెళ్లిపోతుందని మళ్లీ పుకార్లు వచ్చాయి. కాని ఆమె అతన్ని కంటికిరెప్పలా చూసుకుంటూ కడవరకూ అన్ని సేవలూ చేసింది. వాళ్లిద్దరిమధ్యా ఎలాంటి సంబంధముండేదనేది ఒక మిస్టరీగానే మిగిలిపోయింది.

అలోచనల్నుంచి తేరుకుని నేను సమావేశానికి బయలుదేరాను. చీకటిపడుతోంది. చివరి పక్షులు గూళ్లు చేరుతున్నాయి. పూలు, సోడాలమ్మే బళ్లవాళ్లు వెళ్లిపోతూ చివరిసారిగా అరుస్తున్నారు. కొబ్బరిచెట్లు గాలికి బరువుగా ఊగుతున్నాయి. వీధిమొదట్లో ఎత్తైన బురుజు మసకబడుతోంది. వీధికుక్కలు దిగులుగా తిరుగుతున్నాయి. ధనుంజయ పాతబడిన ఇల్లు చీకట్లోకి ఒరుగుతోంది.

హల్లో మాకోసం వేసిన కుర్చీలు తప్ప ధనుంజయ ఇల్లు ఖాళీగా ఉంది. అప్పటికే మా సంఘ పెద్దలు వచ్చి కూర్చున్నారు. ‘మావీధి పరోపకారి’ పాండురంగ అందరికీ నీళ్లు, బిస్కట్లు, టీ ఇస్తున్నాడు. ఒక మూలగా రత్నమ్మ దిగాలుగా కూర్చొనుంది. యీ ఆర్నెలల్లో చిక్కిపోయి ముందులాగ కళావిహీనంగా తయారైంది. పక్కనే పాండురంగ భార్య సుశీల కూర్చుని ఆమెకు ఏదో చెప్తోంది.

అందరూ సర్దుకున్నాక ధనుంజయ పెద్దకొడుకు శేషు పాత సంగతులు గుర్తుచేసుకుని, ‘తాము దూరంగా ఉండడంవల్ల తమ తండ్రి చనిపోయింతర్వాత ఆ యిల్లు అద్దెకిచ్చేసా’మని వివరించి, అంతకాలం తమకుటుంబాన్ని ఎంతో ఆదరించి దన్నుగా నిలబడిన సంక్షేమ సంఘం పెద్దలకు కృతజ్ఞతలు చెప్పాడు. అతని తమ్ముడు మణ్యం సంఘసభ్యులను ఒక్కొక్కరినే పొగుడుతూ వాళ్లతో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నాడు.

ఆతరువాత మా సంఘం ఉపాధ్యక్షుడు మూర్తి, మిగతా సభ్యులు వాళ్లని మెచ్చుకుంటూ మట్లాడారు.

"ఇదేదో పరస్పర అభినందన సభకు వచ్చినట్టుందే" అన్నాడు చలపతి నాతో చిన్నగా.

"సంప్రదాయ రాజకీయం" అన్నాన్నేను నవ్వి.

అందరూ మాట్లాడాక "రత్నమ్మగారికి యేదైనా యేర్పాటు చేసారా?" అనడిగాడు చలపతి.

"అదే చెప్దామనుకుంటున్నాం. ఆమెకు జీవితాంతం యే యిబ్బందీలేకుండా ఆమె పేరుమీద బ్యాంకులో యాభైవేలు డిపాజిట్ చేసాం. ఆవిడ తన చుట్టాల్లో యెవరిదగ్గరికైనా వెళ్ళి గౌరవంగా వుండవచ్చు" అన్నాడు శేషు.

"యాభైవేలా? వడ్డీరేట్లు బాగా తగ్గిపోయాయి. వడ్డి నెలకు మూడొందలైనా వస్తుందా?" అన్నాన్నేను.

అందరూ మావైపు కోపంగా చూసారు.

"ఆమె మాయింట్లో కొన్నాళ్ళు సాయంగా ఉండడానికి వచ్చినా మానాన్న యింతకాలం ఆమెకు తిండికీ బట్టకూ లోటూ రాకుండా చూసారు. ధనసహాయం చేసారు. ఇంకా యేం చెయ్యాలి? యిదైనా మేంకాబట్టి అభిమానంతో యిస్తున్నాం" అన్నాడు మణ్యం.

"నేను జీతానికొచ్చిన పనిమనిషినా బాబూ? నాకే డబ్బూ అక్కర్లేదు నాయనా. మీరందరూ బాగుంటే అంతే చాలు" అంది రత్నమ్మ గాద్గికంగా.

"నువ్వీకుటుంబం దగ్గర ఆరేళ్లగా పనిచేస్తున్నావు. అలా యివ్వడం వాళ్లు ధర్మంగా భావిస్తున్నారు. కాదనకు" అన్నాడు మూర్తి.

"నీకూ వాళ్లకూ యే సంబంధం లేకపోయినా నీ క్షేమం కోరుకుంటున్నారు గదమ్మా" అన్నాడు స్వామినాయుడు.

"నన్ను తాయారక్క స్వంత చెల్లెల్లాగే చూసుకుంది. అనక ఆయనెలా చూసుకున్నారో మీకందరికీ తెలుసు. నాకేమీ అక్కర్లేదు బాబూ, పెద్దవాళ్లు మీరంతా వస్తారంటే వున్నాను" అంది రత్నమ్మ చీరచెంగుతో కళ్లొత్తుకుంటూ.

"ఐతే ఆస్తిలో భాగం రాసిమ్మంటావా?" అవేశంగా అడిగాడు శేషు.

"నువ్వావేశపడకు మేం మాట్లాడుతున్నాంగా" అని శాంతింపజేసాడు బంగార్రాజు.

"నీ మనసులోని మాటేదో చెప్పు రత్నమ్మా" అంది మా సంఘ ఏకైక సభ్యురాలు సుగుణమ్మ అనునయంగా.

"నాకు ఆయనేమౌతాడో, అయనకు నేనేమౌతానో ఆ భగవంతుడికే తెలుసు. ఆయన మంచంమీదున్నప్పుడు యెట్లా చూసుకున్నానో మీకందరికీ తెలుసు. కమల పురుళ్లకొచ్చినప్పుడు ఆమెను నా స్వంత కూతురిలాగా చూసుకున్నాను. ఆయన కొడుకులు నాకూ కొడుకులే" రత్నమ్మ కళ్లు సగం మూసుకుని చెప్పుకుపోతోంది.

"అదంతా సరే రత్నమ్మా, యిప్పుడు నీకేంకావాలో చెప్పు" అన్నాడు ధనరాజ్ అడ్డుతగులుతూ.

"నాకేమీ వద్దు బాబూ, ఆయన మంచంలో వున్నప్పుడు గాలి వెల్తురు బావున్నాయని ఆ పెరటివైపున్న గదిలోనే వుండేవారు. నేనాయనకు అక్కడే సేవ చేసుకున్నాను. మరో రెండేళ్లు నన్ను ఆ గదిలో వుండనివ్వండి. మిగతాయిల్లంతా మీరు అద్దెకిచ్చినా యెవరికీ యిబ్బంది వుండదు. ఆయన్ను తల్చుకుంటూ యీ రెండేళ్లూ నేనక్కడుంటాను. అదొక్కటే నేనడిగేది" అంది రత్నమ్మ.

"రెండు సంవత్సరాలే యెందుకు? అడిగాడు బసవలింగం

"మా అక్క కొడుకు ఆఫ్రికాలో యేదో దేశంలో వుద్యోగంలో వున్నాడు. నేనే వాణ్ణి పెంచి పెద్ద చేసాను. వాడు రెండేళ్ల తరువాత మనదేశం వచ్చేసాక నన్ను తీసికెళ్తానన్నాడు" అంది రత్నమ్మ .

కాస్సేపు ఎవరూ మాట్లాడలేదు.

"అదంతా కుదరదు. యిప్పుడావిడను యీ యింట్లో వుంచడం మాకిష్టంలేదు. కావాలంటే మరో పదివేలిస్తాము" అసమ్మతిని తెలియజేసాడు శేషు.

"ఆవిడ వెళ్లిపోతానని చెప్తోందిగదా. మీ నాన్నకు యెంతో సేవ చేసింది. ఆమెకు వొకరూము యివ్వడంవల్ల మీకొచ్చిన నష్టం యేముంటుంది?" అన్నాడు చలపతి.

"మా కుటుంబానికి ఆవిడ వల్ల వచ్చిన అప్రదిష్ట మీకు తెలుసు. ఆవిడ యింకా యీయింట్లో వుంటే పుకార్లను మేమే నిజం చేసినవాళ్లమౌతాము" అన్నాడు మణ్యం.

"మీ నాన్నే పోయాక యిక పుకార్లను యెవరు గుర్తు పెట్టుకుంటారు మణ్యం?" అన్నాను నేను.

"స్త్రీ పురుషులిద్దరూ యిష్టపడి ఒకే కప్పుకింద సహజీవనం చేస్తే తప్పేమీ లేదని మన మూల సంప్రదాయం చెప్తుంది" అన్నాడు కాశీనాథ్.

"మణ్యం చేప్పేది తీసేసే విషయం కాదు సూర్యం. వాళ్లిచ్చిన డబ్బు తీసుకుని ఆమె వెళ్లిపోవడమే అందరికీ మంచిది" అన్నాడు మూర్తి కాశీనాథ్ మాటలు పట్టించుకోకుండా.

మిగతా సభ్యులంతా మూర్తిని బలపరచి 'ఇంటి యజమానులు వెళ్లమన్నాక ఇక రత్నమ్మకు వేరే మార్గం లే'దని గట్టిగా చెప్పారు. రత్నమ్మ కళ్లనీళ్లు పెట్టుకుంది.

సమావేశం ముగిసి అందరం బయటకు నడిచాము.

ఆతరువాత కామేశ్వరి ఆహ్వానం మీద కొన్నాళ్లు రత్నమ్మ మాయింట్లో ఉంది.

ఒకరోజు ఆమె తన సామాన్లను తీసుకుని మార్కండేయస్వామి గుడిలోని ఒక చిన్న గదిలోకి వెళ్లిపోయింది.

"జీతం బత్తెంలేని పనిమనిషిలాగా మీరు నన్ను వాడుకుంటున్నారని మన వీధి పెద్దవాళ్లు అంటున్నారు బాబూ. నాలాంటి కొంతమంది జీవితాలంతే, సహాయం చేసినవాళ్లక్కూడా చెడ్డపేరు తెస్తారు" అంది వెళ్లేముందు.

"యింకా యీ వీధిలో వుండడమెందుకు? హైద్రాబాదులో నాకు తెల్సిన వాళ్లకు క్యాటరింగ్ బిజినెస్ వుంది. అక్కడ గౌరవంగా యీ మూడేళ్లూ గడుపు" అంది కామేశ్వరి.

రత్నమ్మ తలవొంచుకుని "పెళ్లైన కొన్నాళ్లకే భర్తను పోగొట్టుకొని వొంటరి ఆడదానిగా యిరవైయేండ్లు ఎక్కడెక్కడో యెన్నో అవమానాలు పడి యింక చచ్చిపోదామనుకునే సమయంలో ధనుంజయ నన్ను వొక మనిషిలాగ

అభిమానంగా, ప్రేమగా చూసారు. ఆ పెంకుటింట్లో ఆయనతో వున్న యీ ఆరేళ్లే నేను బతికినట్టు. బయటినుంచైనా ఆ యిల్లు చూస్తూ కొన్నాళ్లు యీవీధిలోనే వుంటాను" అంది.

"మా సంఘపెద్దల ఆదేశాలకు విరుద్ధంగా యిక్కడే వుంటే నిన్ను మనశ్శాంతిగా వుండనిస్తారా?" అడిగాన్నేను.

"అవమానాలు నాకు కొత్తా బాబూ. యీవీధిలో మీలాంటి మంచివాళ్లుకూడా వున్నారుగా. దిక్కులేని ఆడదాని వుసురు తగుల్తుందేమోనని కొంతమంది చెప్పాక మూడునెల్లు గుళ్లో వుండడానికి మీ సంఘ పెద్దలు వొపుకున్నారు" అని వెళ్లిపోయింది రత్నమ్మ .

“మీ సంఘ పెద్దలు సంప్రదాయాన్ని స్వలాభంకోసం వాడుకుంటున్నారు కాబట్టి అప్పుడప్పుడూ అందులోని యిట్లాంటి రివర్స్ లాజిక్ కి లొంగిపోక తప్పదుగదా" అంది కామేశ్వరి నవ్వుతూ.

తరువాతి రోజుల్లో గుడికెళ్లినప్పుడంతా అక్కడ ఏదోవొక పని చేస్తూ కనపడేది రత్నమ్మ. ఏపని చేస్తున్నా మా సంఘ పెద్దల కంట్లో పడకుండా జాగ్రత్త పడేది. ఎవరింట్లో ఏ కార్యమైనా రోజూ వెళ్లి వాళ్లకి సహాయపడేది. ఎవరైనా తృణమో ఫణమో ఇస్తే తీసుకునేది, ఇవ్వకపోయినా అడిగేది కాదు. ఏరోజు తింటున్నదో ఏరోజు లేదో ఎవరికీ తెలియనిచ్చేదికాదు.

ప్రతిరోజూ సాయంకాలం చీకటి పడ్డాక ఒక్కతే కాస్సేపు ధనుంజయ ఇంటి అరుగుమీద కూర్చునేది.

రత్నమ్మ గుళ్లో చేరి రెండున్నర నెలలు దాటిపోయాయి. మా సంఘపెద్దలు గుళ్లో హోమం తలపెట్టారు. ఆమె ఉంటున్న రూము అవసరమైంది. మా పెద్దల సంఘం తరఫున సెక్రటరి మునిరెడ్డి ఆమెను కలసి మరో పదిరోజుల్లో రూము ఖాళీ చెయ్యాలని చెప్పాడు. అంతే కాకుండా ‘ఆ రూము ఆ తరువాతకూడా గుడికి అవసరమనీ, ఆమె ఏదైనా శాశ్వత పరిష్కారం చూసుకుంటే మంచి’దని సలహా ఇచ్చాడు.

ఇక ఆమె నాలుగురోజుల్లో రూము ఖాళీ చెయాల్సివుండగా ఆ సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికొచ్చిన నాకు అప్పుడే కామేశ్వరితో మాట్లాడి వెళ్తున్న ‘వార్తల వనజమ్మ’ ఎదురైంది.

"వనజమ్మ యేదైనా కొత్తవార్త మోసుకొచ్చిందా?" అడిగాను నవ్వుతూ.

"వనజమ్మ అప్పుడప్పుడూ మంచివార్తలు కూడా మోసుకొస్తూంటుంది. వూళ్లో యేదో ఆఫీసులో మిగిలిపోయిన పనిమీద రేపు కమల వస్తోందట. కొత్త కాలనిలో స్నేహితురాలింట్లో దిగుతోందట. యెల్లుండి వెళ్లిపోతుందట" అంది కామేశ్వరి.

"అది మంచివార్త యెలా ఐంది?"

"కమల రత్నమ్మకు వాళ్లింట్లో ఆ గది యిస్తుందేమో అడిగి చూద్దాం"

"నీ పిచ్చిగాని ఆమె అన్నలు రత్నమ్మను వెళ్లగొట్టిన విషయం ఆమెకు తెలిసీ వూరుకుంది. ఆ యిల్లు అద్దెక్కూడా యిచ్చేసారు. యిప్పుడామె యేదో చేస్తుందని యెలా అనుకుంటున్నావు? అసలు ఆమె మనవీధివైపు వస్తుందో రాదో" అన్నాను.

"గుళ్లో రేపు సాయంత్రం ఆమె పూజ చేయిస్తోందట. వస్తుందనే అంటున్నారు"

"ఐతే నువ్వే వెళ్లి మాట్లాడు" అన్నా.

"నువ్వుకూడా రా. ఆమెను వెళ్లగొట్టిన రోజూ మీటింగులో నువ్వు కూడా వున్నావు. అసలేంజరిగిందో నువ్వే చెప్పగలవు"

"సరే నీ తృప్తికోసం వస్తా" అన్నాను.

ఆ మరుసటిరోజు సాయంత్రం గుడికి వెళ్తూ కమల మొదట మాయింటికే వచ్చింది. పెరట్లో కూర్చున్నాం. కుశలప్రశ్నలయ్యాక రత్నమ్మ ప్రసక్తి వచ్చినప్పుడు ఆమెకు జరిగిందంతా చెప్పింది కామేశ్వరి. ఆరోజు ఎంజరిగిందో నేను వివరించాను.

కమల కాసేపు ఏమీ మాట్లాడలేదు. మొహం ఎర్రబడింది. ఆ తరువాత ఆమె ఏదో చెప్పబోయేంతలో గుడి పూజారి పంపిన మనిషి వచ్చి పూజకు వేళ దాటిపోతూందని పిలిచాడు.

"మీరు కూడా గుడికి రండన్నా" అని మాకు చెప్పి ఆమె అతనితో వెళ్లిపోయింది.

అరగంట తరువాత నేను కామేశ్వరి గుడికెళ్లాము. నదికవతల ఫ్యాక్టరి మొండిగోడలు అప్పటికే పూర్తిగా చీకట్లో కలసిపోయాయి. వీధి సద్దుమణిగింది. ఎదురుగా రాయుడిగారి మేడలో సందడి లేదు. గుళ్లో జనం లేరు. పూజ ముగిసి కమల అప్పుడే గర్భగుడినుంచి బయటికి వస్తోంది.

మమ్మల్ని చూసి గుడి వెనకవైపున్న రూములవైపు దారితీసింది కమల. వెనక భాగంలో పూలతోటకవతల ప్రహరీ గోడకానుకుని మూలల్లో రెండు రూములున్నాయి. అందులో ఒకరూములో రత్నమ్మ ఉంటోంది.

చిన్న గది, మసిబారిన రాతిగోడలు, పాత బల్బు. సగం చీకటిగానే ఉంది. రత్నమ్మ అటు తిరిగి గోడకున్న అరలను శుభ్రం చేస్తోంది.

కమల గదిలోకి వెళ్లి "పిన్నీ" అని పిలిచింది.

రత్నమ్మ కమలను చూసి మొహమంతా నవ్వు చేసుకుని లేచి "యెప్పుడొచ్చావమ్మా" అంటూ ఆదరంగా కమలను దగ్గరికి తీసుకుంది.

"యింట్లో కాకుండా ఇక్కడున్నావేంటి పిన్నీ" అంది కమల కళ్లనీళ్లతో

"యెక్కడుంటేనేమమ్మా వొక్కదాన్ని" అంది రత్నమ్మ

“వీల్లేదు పిన్నీ నువ్వు యింట్లోనే వుండాలి. నిన్నాయింట్లోనే వుంచమని అన్నయ్యలకి చెప్పానే. నువ్వక్కడుంటేగాని నాన్న ఆత్మ శాంతించదు పిన్నీ”

“అది మీ అన్నల యిల్లు వాళ్లిష్టప్రకారమే కానీయమ్మా” అంది రత్నమ్మ నవ్వు తెచ్చుకుని.

“అది వాళ్లయిల్లు యెందుకౌతుంది? మీకు చెప్పలేదా? నాన్న పోయాక పంపకాల్లో ఆయిల్లు నాకొచ్చింది. దానిమీద వాళ్ల పెత్తనమేమీ లేదు. రేప్పొద్దునే అద్దెకున్నవాళ్లతో చెప్పి ఆ రూము ఖాళీ చేయిస్తాను. రేపు సాయంత్రంలోపల నువ్వక్కడికి మారాలి. నువ్వు మారాకే నేను వూరెళ్తాను" అంది కమల.

రత్నమ్మ కళ్లలో నీళ్లు జలజలా రాలాయి. ఆమె కమల చేతుల్లో తన మొహం ఉంచింది.

“పిన్నీ నువ్వు యెంతకాలం వుండాలనుకుంటే అంతకాలం ఆ యింట్లో వుండు. నీపేరుతో వేసిన ఆ డబ్బు కూడా వాడుకో. యింకా అవసరమైనప్పుడు నాకు చెప్పు పంపిస్తాను. నీ మనమలు నీకిది పంపించారు తీసుకో” అని ఒక బట్టల ప్యాకెట్ రత్నమ్మ చేతిలో పెట్టింది.

రత్నమ్మ కాసేపు అలాగే కమలవైపు చూసి “చల్లగా వుండు తల్లీ” అంది. అందరం బయటికి నడిచాము.

“నేను పొద్దున్నే వస్తాను. సామాన్లు సర్దుకుని రెడీగావుండు. వీధిలోని పెద్దమనుషుల్ని పట్టించుకోకు. నాల్రోజుల తరువాత వాళ్లే వూరుకుంటారు" అని ధైర్యం చెప్పి "అప్పుడప్పుడూ నేనొచ్చి మావూరు తీసుకెళ్తూంటాను" అంది కమల.

రత్నమ్మ గుళ్లోనే ఆగిపోయింది. మేము ఇంటిదారి పట్టాము.

“పిన్నికి ఆయింట్లోనే వసతి యివ్వమని మా నాన్న పోయేముందు చెప్పారు. ఆమెకు యిబ్బంది లేకుండా అవసరమైనంత డబ్బూ ఆమె పేర్తో వెయ్యమని అన్నారు. అన్నయ్యలెందుకలా చేసారో" అంది కమల మాతో.

“చిన్నదానివైనా నీది పెద్ద మనసు" అంది కామేశ్వరి కమల చేతిని తనచేతిలోకి తీసుకుని

“మీ అన్నయ్యలు పరువుగురించి ఆలోచించారు” అన్నాను నేను.

కమల నవ్వింది.

మాయిల్లు రాగానే ఆమె మాకు ధన్యవాదాలు చెప్పి వెళ్లిపోయింది.

“యెంతైనా ఆడమనిషి మనసే వేరు” అంది కామేశ్వరి తాళం తీస్తూ.

“నీ పాట నీదే” అన్నాన్నేను నవ్వుతూ.

(మా బురుజ వీధి చెప్పిన మరోకథ వచ్చేనెలలో)

Post your comments